క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కాటారం : మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర గిరిజన గురుకుల బాలుర సంక్షేమ పాఠశాలలో 2025–26 సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.బాలు సోమవారం తెలిపారు. ఐదోతరగతిలో ప్రవేశానికి, 6 నుంచి 9 తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ప్రక్రియలో భాగంగా కులం, ఆదాయం, బోనఫైడ్, ఆధార్, ఫొటో సమర్పించాలని తెలిపారు. ఫిబ్రవరి 1 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల తుది గడువు ఉందని అర్హతగల విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

నియామకం

రేగొండ : తెలంగాణ ప్రదేశ్ ఎరుకుల సంఘం మండల కమిటీ అధ్యక్షుడిగా మండలంలోని బాగిర్థిపేటకు చెందిన దేవరకొండ సారంగంను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్యాల స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సారంగం మాట్లాడుతూ.. ఎరుకుల కులస్తుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

'కాలనీ సమస్యలు పట్టించుకోవడం లేదు'

భూపాలపల్లి అర్బన్ : పట్టణంలోని 25వ వార్డు పరిధి కారల్‌మార్క్స్ కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో వార్డు కౌన్సిలర్ పట్టించుకోవడం లేదని కాలనీ మహిళలు ఆరోపించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాలనీ మహిళలు పెద్దమాముల సంధ్య, బల్ల సత్యవతి మాట్లాడుతూ.. కాలనీలో తాగునీటి సమస్య, కోతుల, కుక్కల బెడద, అంతర్గత పారిశుద్ధ్యం, లైట్లు పని చేయడం లేదన్నారు. వార్డులో గెలిచిన కౌన్సిలర్ స్థానికంగా ఉండకుండా వేరే ప్రాంతంలో నివసిస్తున్నట్లు ఆరోపించారు. ఈ సమావేశంలో మహిళలు పల్లెర్ల రజిత, నాగమణి పాల్గొన్నారు.

నివాళి




చిట్యాల : మండలంలోని నవాబుపేటకు చెందిన నేరెళ్ల రాజ పోచయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులను అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య సోమవారం పరామర్శించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట ఏవైఎస్ నాయకులు గుర్రపు రాజేందర్, జన్నె యుగేందర్, గుర్రం అశోక్, రమేశ్ తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ



కాళేశ్వరం : మహదేవపూర్ మండల కేంద్రంలోని జంక్షన్ వద్ద తెలంగాణ నుంచి మహారాష్ట్రకు వచ్చిపోయే వాహనాలను మహదేవపూర్, కాళేశ్వరం ఎస్సైలు పవన్‌కుమార్, చక్రపాణి తనిఖీ చేపట్టారు. సోమవారం వాహనాల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి పత్రాలు లేని పది వాహనాలను సీజ్ చేశారు. వారి వెంట పోలీసులు ఉన్నారు.

కంటి వైద్యశిబిరం



ములుగు రూరల్ : మండలంలోని బండారుపల్లిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు సోమవారం లయన్స్ సభ్యుడు కొండి సాంబశివ సహకారంతో కంటి పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో మొత్తం 78 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 13 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యుడు తిరుమలరావు తెలిపారు. బాధితులకు కంటి ఆపరేషన్లు చేయించేందుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో సోమశేఖర్‌రెడ్డి, జంజిరాల దేవయ్య, లయన్స్ ప్రెసిడెంట్ మేరుగు రమేష్, చుంచు రమేష్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

వాజేడు : మండల కేంద్రంలో జనవరి 8వ తేదీన నిర్వహించ తలపెట్టిన ఆదివాసీల హక్కులు, చట్టాల అవగాహన సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ భూమి పుత్ర ఆదివాసీ సంఘం మండల అధ్యక్షుడు మద్ద నర్సింహులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ భూమి పుత్ర ఆదివాసీ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశానికి కోరం సందీప్ అధ్యక్షతన నిర్వహించారు.

రోడ్డు నిర్మాణానికి అనుమతి

- ఫారెస్ట్ రోడ్డుపై చిగురించిన ఆశలు
- మంత్రి ప్రకటనతో స్థానికుల్లో హర్షం
- రూ.4.67 కోట్లు చెల్లించాలని అటవీ శాఖ ఉత్తర్వులు



కిషన్‌రావుపల్లి-భూపాలపల్లి అటవీ ప్రాంతంలోని రహదారి

మల్హర్ : ఎన్నో ఏళ్ల కలగా మిగిలిన రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు చివరి దశకు చేరుకోవడం, ఈ రోడ్డు నిర్మాణంపై మంత్రి శ్రీధర్ బాబు ఇచ్చిన ప్రకటనతో ఫారెస్ట్ రోడ్డు నిర్మాణంపై ఆశలు చిగురించాయి. పెద్దతూండ్ల–కిషన్‌రావుపల్లి ఫారెస్ట్ రోడ్డు నిర్మాణానికి ఉన్న సాంకేతిక ఇబ్బందులను తొలగించి 2025 మార్చిలో శ్రీకారం చూడతామని మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించడంతో ఈ ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మల్హర్–తాడిచర్ల నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చేరుకోవాలంటే ప్రస్తుతం కాటారం మీదుగా ప్రయాణించాల్సి వస్తోంది. తమ ప్రాంతం నుంచి పెద్దతూండ్ల మీదుగా అటవీ ప్రాంతం గుండా రహదారి నిర్మిస్తే సమయంతో పాటు ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయని ప్రజలు చెబుతున్నారు. అంతే కాకుండా మంథని నుంచి భూపాలపల్లికి వెళ్లే వారు కూడా ఎంతో వ్యయ, ప్రయాసలకు ఓర్చుకోవాల్సి వస్తుంది. గత ఏడాది తాడిచర్ల–ఖమ్మంపల్లి గ్రామాల మధ్య మానేరు నదిపై వంతెన అందుబాటులోకి రావడంతో దూర భారం తగ్గింది. 2017లో ఖమ్మంపల్లి నుంచి భూపాలపల్లి వరకు 20 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి అనుమతి రాగా 12 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. మిగతా రోడ్డు నిర్మాణానికి అటవీ అనుమతులు రాకపోవడంతో నిర్మాణాన్ని నిలిపివేశారు.

పరిహారం చెల్లించాలని అటవీశాఖ ఉత్తర్వులు

రిజర్వ్ ఫారెస్ట్ నుంచి రోడ్డు నిర్మాణానికి మోకాలడ్డిన అటవీ శాఖ అధికారులు ఎట్టకేలకు ఒక వరుస రహదారి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది. మల్హర్ మండలం పెద్దతూండ్ల గ్రామపంచాయతీ పరిధిలోని కిషన్‌రావుపల్లి నుంచి అటవీప్రాంతం గుండా భూపాలపల్లి వన్ ఇంక్లైన్ మైన్ వరకు ఏడు మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణం చేపట్టవచ్చని కాగా ఆ ప్రాంతంలో తాము నష్టపోతున్న చెట్ల సంపదకు గాను రూ.4.67 కోట్ల పరిహారాన్ని చెల్లించాలని అటవీశాఖ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

తగ్గనున్న దూరభారం..

మంథని నుంచి భూపాలపల్లికి వెళ్లాలంటే కాటారం మీదుగా 60 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి ఉంటుంది. కానీ ఖమ్మంపల్లి–తాడిచర్ల మీదుగా కేవలం 30 కిలోమీటర్లలోనే భూపాలపల్లికి చేరుకోవచ్చు. నిత్యం వందలాది వాహనాలు మంథని మీదుగా సుదూర ప్రాంతం నుంచి వెళ్తున్నాయి. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే సగం దూరభారం తగ్గనుండటంతో విద్య, వైద్యం మరింత మెరుగుపడనుంది. అలాగే సమయంతో పాటు ఇంధన ఖర్చులు భారీగా ఆదా కానున్నాయి.

ఇబ్బందులు తొలగుతాయి



కిషన్‌రావుపల్లి ఫారెస్ట్‌లో రోడ్డు నిర్మిస్తే భూపాలపల్లి, వరంగల్‌కు వెళ్లడానికి మరింత దగ్గరవుతది. పిల్లల ఉన్నత చదువులకు, ఆస్పత్రులకు వెళ్లడాని అనువుగా ఉంటుంది. అలాగే ప్రయాణ భారం తగ్గి, ఇబ్బందులు తొలగుతాయి.

– పింగిళి సారయ్య, పెద్దతూండ్ల, మల్హర్

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



పెద్దతూండ్ల–కిషన్‌రావుపల్లిలో సాధ్యమైనంత త్వరగా రోడ్డు నిర్మాణం చేపట్టాలి. కార్యాలయాలకు, ఇతర అవసరాలకు భూపాలపల్లికి వెళ్లడానికి కొయ్యూరు, నాగులమ్మ మీదుగా భూపాలపల్లికి పోతున్నాం. ఈ రోడ్డు వేస్తే తొందరగా భూపాలపల్లికి వెళ్లొచ్చు.

– మంథని సమ్మయ్య, పెద్దతూండ్ల, మల్హర్

టోల్ వసూలు నిలిపేయాలి



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న శ్రావణ్‌కుమార్

కాటారం : మండలంలోని మేడిపల్లి టోల్‌గేట్ వద్ద టోల్ రుసుం వసూలు నిలిపేయాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు జక్కు శ్రావణ్‌కుమార్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు పత్రాన్ని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్‌కు అందజేసి పరిస్థితిని వివరించారు. టోల్ నిర్వాహణ కోసం సదరు కాంట్రాక్టర్ కనీస ప్రమాణాలు పాటించడం లేదని పేర్కొన్నారు. కనీస సౌకర్యాలు లేవని శ్రావణ్‌కుమార్ అదనపు కలెక్టర్‌కు వివరించారు. భారీ వెడల్పు వాహనాలు టోల్‌గేట్ గుండా వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని తెలిపారు. రహదారి సరిగా లేకపోవడంతో ఎంతో మంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై మృతి చెందారన్నారు. పలుమార్లు నేషనల్ హైవే అధికారులకు ఫిర్యాదు చేసిన, ప్రజావాణిలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి ఫలితం లేదని ఆరోపించారు. టోల్‌గేట్ నిర్వాహణ కాంట్రాక్టర్ కనీస వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న టోల్ వసూలు నిలిపివేయాలని అదనపు కలెక్టర్‌ను కోరారు.

మానసిక వికాసంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రవీందర్

మల్హర్ : మండలంలోని తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం హార్ట్ ఫుల్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ విద్యార్థుల మానసిక భయాన్ని తొలగించేందుకు తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ఏర్పాటు చేసిన మానసిక వికాస నిపుణుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా మానసిక వికాస నిపుణులు, జిల్లా కోఆర్డినేటర్ రవీందర్, నోడల్ ఆఫీసర్ లక్ష్మణ్ పాల్గొని విద్యార్థులు అవగాహన కల్పించారు. పరీక్షల సమయంలో శారీరకంగా, మానసికంగా ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ఉండేందుకు ధ్యానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయదేవి, ఉపన్యాసకులు,సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీందర్



ప్రజావాణిలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్ : జిల్లావ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ.. ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా సోమవారం ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రవీందర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు సొంతంగా డబ్బులు ఖర్చు చేస్తున్నారన్నారు. పంచాయతీల నిధులు సకాలంలో విడుదల కాక కార్యదర్శులు అప్పులు తెచ్చి పనులు చేస్తున్నారని తెలిపారు. చేసిన పనులకి స్పెషల్ ఆఫీసర్లు బిల్లులపై సంతకాలు పెట్టకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. కలెక్టర్ వెంటనే స్పందించి గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్యాల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి కండె రవి, మండల కన్వీనర్ గుండ్ల ఓంకార్, నాయకులు బండారి దశరథ్, మోకిడి అశోక్ పాల్గొన్నారు.

పిల్లల హాజరుశాతాన్ని పెంచాలి



నివాళులర్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

చిట్యాల : మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతాన్ని పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం మండలంలోని రామచంద్రాపూర్ గ్రామంలో చిట్యాల సెక్టార్ సమావేశం నిర్వహించారు. ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు తమ పాఠశాలలో ఉన్న పిల్లలను చక్కగా చూసుకోవాలని కోరారు. రానున్న నూతన సంవత్సరంలో పిల్లల హాజరు శాతాన్ని మరింతగా పెంచాలని కోరారు. కలెక్టర్, అధికారులు పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం 2025 సంవత్సరానికి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గణపురం : మండల కేంద్రంలోని శ్రీ నారాయణ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎ. భానుచందర్ సోమవారం తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల చైర్మెన్ ఎస్.రవి, ప్రిన్సిపాల్ స్రవంతితో పాటు సిబ్బంది అభినందించారు.

'ఆన్‌లైన్‌లో పేదల పేర్లు గల్లంతు'



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేష్

టేకుమట్ల : ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న పేదల పేర్లు ఆన్‌లైన్‌లో గల్లంతయ్యాయని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారెపల్లి మల్లేష్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల కోసం అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఇది వరకు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న పేదల పేర్లు ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో పేర్లు ఉంటేనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తారని, అర్హులైన వారి పేర్లు లేకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరోమారు అవకాశం కల్పించి జాబితాలో అర్హులను చేర్చాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్రూం రాని వారికి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతుందని ఆశపడ్డ వారికి అధికారుల తప్పిదాల వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. ఆయన వెంట సంగి రాజు, జీడి రాజు, రాజయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న మొబైల్స్ అప్పగింత



సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

చిట్యాల : మండలంలోని నైన్‌పాకకు చెందిన ఉమ్మనవేని మల్లేష్ మూడు రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుతుండగా తన మొబైల్ ఎక్కడో పోగొట్టుకున్నాడు. దీంతో అతను పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను గుర్తించారు. సోమవారం బాధితుడి మల్లేష్‌కు ఎస్సై శ్రావన్‌కుమార్ చేతుల మీదుగా మొబైల్‌ను అప్పగించారు. కానిస్టేబుళ్లు కోమల, లాల్‌సింగ్‌లను ఎస్సై అభినందించారు.

కాళేశ్వరంలో..

కాళేశ్వరం : మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన ఎండీ ఇంతియాజ్, పెద్దంపేట గ్రామానికి చెందిన జనగామ ప్రవీణ్ తమ సెల్‌ఫోన్లను ఇటీవల పోగొట్టుకున్నారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సోమవారం ఎస్సై పవన్‌కుమార్ వారికి అందజేశారు. సెల్‌ఫోన్లను గుర్తించడంలో శ్రమించిన కానిస్టేబుల్ నాగేంద్రను ఎస్సై అభినందించారు.

ఘనంగా పుట్ట మల్లన్న బోనాలు



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

కాటారం : మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌పల్లిలో సోమవారం పుట్ట మల్లన్న బోనాల జాతర ఘనంగా జరిగింది. ఆయా గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు సమర్పించారు. మహిళలు స్వయంగా బోనాలు వండి బోనం ఎత్తారు. ఆలయ ఆవరణలో ఒగ్గు కళాకారులతో పట్నాలు వేయించారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల నృత్యాలతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఇంటిల్లిపాది సుఖసంతోషాలతో ఉండి పంటలు సమృద్ధిగా పండాలని స్వామి వారిని వేడుకున్నారు. మాజీ ఎంపీటీసీ తోట జనార్దన్, మాజీ జెడ్పీటీసీ అంగోత్ సుగుణ, పలువురు నాయకులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై అశోక్

గణపురం : మండల ప్రజలు, యువత నూతన సంవత్సర వేడుకలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై రేగ అశోక్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన సంవత్సర వేడుకల పేరుతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించిన, అతిగా మద్యంతాగి గొడవలకు పాల్పడ్డ చట్టపరంగా చర్యలు తీసుకుంటుమన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలకు పోలీస్ శాఖ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారినైన ఉపేక్షించేది లేదన్నారు.

టేకుమట్ల: నేటి అర్ధరాత్రి నుంచి కొనసాగే నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై గోగికారి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో డీజేలు, మద్యం తాగి వాహనాలను ఓవర్ స్పీడ్‌తో నడపడం నిషేధమన్నారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు చర్యలు తప్పవన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో ఇతరులకు ఇబ్బంది కలుగకుండా జరుపుకుంటూ, పోలీసులకు సహకరించాలని పేర్కొన్నారు.

క్రియాశీల సభ్యత్వాలు చేపట్టాలి

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శృతి



సమావేశంలో మాట్లాడుతున్న బంగారు శృతి

ములుగు రూరల్ : భారతీయ జనతా పార్టీ ఎన్నికల సంఘటన్ పర్వ్‌లో భాగంగా ప్రతి మండలంలో 50 క్రియాశీల సభ్యత్వాలు తప్పనిసరిగా చేపట్టాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జోనల్ ఇన్‌చార్జ్ బంగారు శృతి అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీ ఆధ్వర్యంలో మూడు నెలలుగా జిల్లా సభ్యత్వ నమోదు విజయవంతగా పూర్తి చేసి జిల్లా నాయకులు మన్ననలు పొందారని అన్నారు. బూత్ ఎన్నికలు నిర్వహించి మండల అధ్యక్షుల నియామకాల్లో భాగంగా క్రియశీల సభ్యత్వాలు చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా మండల అధ్యక్షుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలలో బీజేపీని గెలిపించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి పెసరు విజయచందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీరా కృష్ణవేణినాయక్, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, చింతల పూడి భాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బలరాం, రవీంద్రాచారి, భూక్యా జవహార్‌లాల్, వెంకట్, రాజునాయక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంకెళ్లతో వినూత్న నిరసన

- అమిత్ షా క్షమాపణ చెప్పాలి
- సీపీఎం మండల కార్యదర్శి మల్లారెడ్డి



గోవిందరావుపేట: సంకెళ్లతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

గోవిందరావుపేట : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఎం మండల కార్యదర్శి సోమా మల్లారెడ్డి అన్నారు. స్థానిక బస్టాండ్ ప్రాగంణంలో సోమవారం అఖిల భారత వామపక్షాల పిలుపు మేరకు అంబేడ్కర్ చిత్రపటం ఎదుట చేతులకు సంకెళ్లు వేసుకోని భారత మాత చిత్రపటాన్ని భారత రాజ్యాంగాన్ని కాపాడండి..ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొదిళ్ల చిట్టిబాబు, మండల కమిటీ సభ్యులు ఉపేంద్రచారి, మురళి, ఎస్డీ అజాద్, చంద్రారెడ్డి, సూర్యనారయణ, రామస్వామి, లెనిన్, కోటేశ్వరరావు, నాగరాజు, బ్రహ్మచారి, శ్రీనివాస్, కారం రజిత, కవిత, సువర్ణ, అరుణ్, జీవన్, శ్రావణ్, అశోక్ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రిని బర్తరఫ్ చేయాలి

ములుగు రూరల్ : అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, సీపీఐ జిల్లా కార్యదర్శి మల్లికార్జున్‌రావు అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు, బ్యానర్లతో నిరసన తెలిపారు. మనువాద సిద్ధాంతాలను అమలు చేసేందుకు రాజ్యాంగంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. రాజ్యాంగంలో కొత్త చట్టాలను తీసుకు వస్తూ కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు వెంకట్‌రెడ్డి, రాజేందర్, గఫూర్ పాషా, ఐలయ్య, ప్రవీణ్, దేవేందర్, సంపత్, రవీందర్, ముత్యాల రాజు, సుధాకర్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి



పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ రవీందర్

గోవిందరావుపేట : వార్షిక తనిఖీల్లో భాగంగా ములుగు డీఎస్పీ ఎన్.రవీందర్ సోమవారం పస్రా పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి, స్టేషన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదంగా ప్రవర్తిస్తూ కేసుకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకోని జాప్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. పాత నేరస్తులపై నిఘా పెట్టాలని డయల్–100 ఫిర్యాదులపై వేగవంతమైన స్పందన ఇస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహిస్తూ నేరాలను నియంత్రణ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, డ్రంకెన్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్ చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. పోలీస్ సిబ్బంది బాధ్యయుతంగా ఉంటూ తమ విధులను క్రమశిక్షణతో నిర్వహించాలని అన్నారు. రోడ్డు భద్రత, ఉమెన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్స్ పట్ల ప్రజలతో పాటు యువతను అప్రమత్తం చేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పోలీసులు అంటే ప్రజల్లో గౌరవం పెరిగేలా ప్రతి ఒక్కరూ ప్రవర్తించాలని అన్నారు. పస్రా ఏజెన్సీ ప్రాంతమైనందున మావోయిస్టు కార్యకలాపాలపై ఎల్లప్పుడూ నిఘా ఉంచాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టులు గిరిజన యువకులు, ప్రజలలో అనేక అపోహలు సృష్టించి వారి సాధారణ జీవనానికి విఘాతం కలిగించే అవకాశం ఉన్నందున పోలీసులు ప్రజలతో మమేకమై వారి నుంచి సమాచారం సేకరిస్తూ మావోయిస్టు భావజాలం దరిచేరకుండా ప్రజలను, యువతను చైతన్యపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో పస్రా సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్, పోలీసులు పాల్గొన్నారు.

స్నైపర్ డాగ్‌తో ముమ్మర తనిఖీ

గోవిందరావుపేట : గోవిందరావుపేట, పస్రా గ్రామాల్లో ప్రత్యేక శిక్షణ పొందిన స్నైపర్ డాగ్‌తో బస్టాండ్ పరిసర ప్రాంతాలలో పస్రా ఎస్సై కమలాకర్ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రత్యేక శిక్షణ పొందిన స్నైపర్ డాగ్ హత్యలు, దోపిడీలు, గంజాయి, డ్రగ్స్, పేలుడు పదార్థాలను పసిగట్టి పట్టించడం జరుగుతుందన్నారు.